



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 229 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 24 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥


VOLUME :9 ISSUE :229 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 24 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


### అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం..

## బెంగాల్‌ను విముక్తం చేయండి

- హుగ్లీ జిల్లా బాలాగర్ లో అమిత్ షా బహిరంగసభ
- బెంగాల్ లో బీజేపీ ప్రభుత్వం రాగానే అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తామన్న అమిత్ షా
- మే 5వ తేదీతో మమతా బెనర్జీ పాలన ముగుస్తుందని ధీమా



**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హుగ్లీ జిల్లా బాలాగర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారీ బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భద్రత, ఆర్థిక వ్యవస్థపై అక్రమ వలసల ప్రభావాన్ని ఎండగట్టారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రాగానే ఒక్కరిని కూడా

- మిగతా 2లో



## టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

### బ్యాంకులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు

- సైబర్ మోసాల కట్టడిపై బ్యాంకులతో హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఉన్నతస్థాయి సమావేశం
- 'జీరో మూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని బ్యాంకులకు ఆదేశం
- అకౌంట్ల సంఖ్య కన్నా పౌర భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- మోసాలకు సహకరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిక
- విదేశాల కేంద్రంగా సైబర్ మోసాలు.. బ్యాంకు అధికారుల పాత్రపై సీపీ ఆందోళన

2లో

### తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్...

## రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు



- సాయంత్రం 5 గంటలకే తమిళనాడులో 82.24%, బెంగాల్‌లో 89.93% ఓటింగ్
- కన్యాకుమారిలో పడవల్లో డ్యామ్ దాటి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న గిరిజనులు
- 2021 ఎన్నికల నాటి పోలింగ్ శాతాన్ని అధిగమించిన రెండు రాష్ట్రాలు
- డీఎంకే కూటమి 200కు పైగా సీట్లు గెలుస్తుందని ఎండీఎంకే నేత వైగో ధీమా

- మిగతా 2లో

### జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన

## ఒంటిమిట్ట అర్చకులు... టీటీడీ ఫైర్

- ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు
- మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం అందించడమే కారణం
- ఆలయ నిబంధనలను ఉల్లంఘించారని అర్చకులపై టీటీడీ ఆగ్రహం
- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం
- సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠిన చర్యలని హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చెందిన ముగ్గురు అర్చకులపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా, పులివెందులలో మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి ఆయనకు వేదాశీర్వచనం అందించినందుకు గాను వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. టీటీడీ పరిధిలో ఉన్న


- మిగతా 2లో

### హరిత, నీలి నగరంగా

# అమరావతిని నిర్మిస్తాం

- అమరావతి పనులకు మళ్లీ ఊపు.. కీలక నిర్ణయాలు తీసుకున్న చంద్రబాబు
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 60వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు ఆదేశం
- ఏపీలో మళ్లీ పెట్టుబడులపై విశ్వాసం పెరిగిందన్న ముఖ్యమంత్రి
- ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో అమరావతి విద్యా కేంద్రంగా మారుతుందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 60వ సీఆర్డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పురపాలక, సీఆర్డీఏ, ఆర్థిక, అటవీ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించారు. అమరావతిని ప్రపంచంలోనే ఓ అత్యుత్తమ హరిత, నీలి (గ్రీన్ అండ్ బ్లూ) నగరంగా, నివాసయోగ్యమైన (లివబుల్) నగరంగా నిర్మిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థలకు అమరావతి నగరం నిలయంగా మారుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. బిట్స్ పిలాని వంటి క్యాంపస్‌ల ఏర్పాటుతో ఇది కీలకమైన విద్యా కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారులకు మళ్లీ విశ్వాసం కలిగిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే రెన్యూ ఎనర్జీ వంటి సంస్థలు ఇంగాట్ సోలార్ వేఫర్ ఉత్పత్తి కోసం అనకాపల్లిలో యూనిట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజధాని నగరాన్ని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై నిర్మించే వంతెనను అత్యంత ఆకర్షణీయంగా, ఓ ఐకానిక్ నిర్మాణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.




### పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు..

## కేంద్రం కీలక ప్రకటన

- ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదన్న కేంద్రం
- ధరల పెంపు వార్తలు అవాస్తవం, దురుద్దేశపూర్వకమని వెల్లడి
- గడిచిన నాలుగేళ్లుగా ధరలు పెంచని ఏకైక దేశం భారతేనని స్పష్టీకరణ
- అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నా భారత్‌లో స్థిరంగానే రేట్లు

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడియా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది.

- మిగతా 2లో







### అనకాపల్లిని మరో రంగారెడ్డి

## జిల్లాగా తీర్చిదిద్దుతాం

- రాంబిల్లిలో రూ.5,400 కోట్లతో రెన్యూ సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యమని వెల్లడి
- గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ ధ్వంసమైందని విమర్శ
- విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ

- మిగతా 2లో

### జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరించిన ఏపీ శాసనమండలి చైర్మన్

- ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరణ
- నిర్ణయం తీసుకున్న మండలి చైర్మన్ మోషేన్ రాజు
- రాజీనామాపై హైకోర్టు ఆదేశాలతో నిర్ణయం వెల్లడి
- సమాధానం సంతృప్తికరంగా లేదన్న చైర్మన్
- యథాతథంగా కొనసాగనున్న జయమంగళ ఎమ్మెల్సీ పదవి


- మిగతా 2లో



### తెలంగాణలో నేటి నుంచే వేసవి సెలవులు

- తెలంగాణలోని అన్ని పాఠశాలలకు నేటి నుంచి 50 రోజుల పాటు వేసవి సెలవులు
- సెలవులు ప్రకటిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న తిరిగి ప్రారంభంకానున్న పాఠశాలలు

- మిగతా 2లో



### అనంతబాబుకు సమాచారం అందించినట్టు ఆరోపణలు.. సీఐపై వేటు

- డ్రైవర్ హత్య కేసులో ఏ1గా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు
- కేసు దర్యాప్తు సమాచారాన్ని ఆయనకు అందించినట్టు సీఐ రవికుమార్ పై ఆరోపణలు
- వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసిన ఏలూరు రేంజ్ ఐజీ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### హర్మూజ్ జలసంధిలో 'డిజిటల్' బాంబు.. ఇరాన్ తదుపరి టార్గెట్ డేటా కేబుల్స్..?

ఒకప్పుడు యుద్ధాలు కేవలం సరిహద్దుల్లో ఆయుధాలతో జరిగేవి.. కానీ ఇప్పుడు 'డిజిటల్' రూపం సంతరించుకున్నాయి. చమురు సరఫరా అడ్డుకోవడం ద్వారా ప్రపంచాన్ని వణికించిన ఇరాన్, ఇప్పుడు 'సముద్రగర్భ డేటా కేబుల్స్'పై దృష్టి సారించిందన్న వార్త ఆధునిక ప్రపంచానికి వెన్నులో వణుకు పుట్టిస్తోంది. చమురు లేకపోతే బండ్లు ఆగుతాయి, కానీ డేటా లేకపోతే దేశాలే ఆగిపోతాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఫిజికల్ వార్ నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వార్‌గా మారుతుంది. హర్మూజ్ జలసంధి కేవలం నౌకలు వెళ్లే దారి మాత్రమే కాదు, అది ప్రపంచాన్ని కలిపే డిజిటల్ హైవే కూడా. ఇరాన్ మీడియా నుంచి అందుతున్న సంకేతాల ప్రకారం.., అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను దెబ్బతీయడానికి ఇరాన్ ఇప్పుడు 'సముద్రగర్భ కేబుల్స్'ను ఆయుధంగా వాడుకోవాలని చూస్తోంది. ఇది జరిగితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించని విపత్తును ఎదుర్కోవాల్సి ఉంటుంది. మనకు ఇంటర్నెట్ శాటిలైట్ల ద్వారా వస్తుందని చాలా మంది అనుకుంటారు. కానీ వాస్తవానికి 95 శాతానికి పైగా అంతర్జాతీయ డేటా ట్రాఫిక్ సముద్రం అడుగున ఉండే కేబుల్స్ ద్వారానే సాగుతుంది. గల్ఫ్ దేశాలను యూరప్, ఆసియాతో కలిపే అనేక ప్రధాన కేబుల్ వ్యవస్థలు హర్మూజ్ జలసంధి గుండా వెళ్తాయి. అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీలు, క్లౌడ్ డేటా స్టోరేజ్, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వాల మధ్య కమ్యూనికేషన్ అంతా ఈ కేబుల్స్ పైనే ఆధారపడి ఉంటుంది.

**అసలు వ్యూహం ఇదేనా?**

చమురు ట్యాంకర్లను అడ్డుకోవడం వల్ల ఇరాన్ ఇప్పటికే ప్రపంచ దేశాల ఆగ్రహానికి గురైంది. ఇప్పుడు డేటా కేబుల్స్ ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మరింత ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది. ఈ కేబుల్స్ సముద్రం అడుగున కొన్ని అడుగుల లోతులో ఉంటాయి. ఒక చిన్న లంగరు ద్వారా లేదా ఉద్దేశపూర్వకంగా సబ్‌మెరైన్లతో వీటిని కట్ చేయడం చాలా సులభం. ప్రధాన కేబుల్స్ దెబ్బతింటే, పెర్షియన్ గల్ఫ్ దేశాల్లో ఇంటర్నెట్ పూర్తిగా స్తంభించిపోతుంది. బ్యాంకింగ్ సర్వీసులు ఆగిపోయి, ప్రజలు నగదు విత్‌డ్రా చేసుకోలేక, ఆన్‌లైన్ పేమెంట్స్ చేయలేక గందరగోళం నెలకొంటుంది. ఇరాన్ గనుక ఈ డేటా యుద్ధానికి దిగితే, అది కేవలం అమెరికా-ఇజ్రాయెల్ దేశాలనే కాదు, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. ఆధునిక ప్రపంచం ఎంతగా టెక్నాలజీపై ఆధారపడి ఉందో, ఆ టెక్నాలజీ ఎంత సులభంగా దెబ్బతినవచ్చో ఈ పరిణామం హెచ్చరిస్తోంది. చమురు సరఫరాను పునరుద్ధరించడానికి ఆరు నెలలు పడుతుందని పెంటగాన్ చెబుతున్న తరుణంలో.. డేటా కేబుల్స్ కు నష్టం జరిగితే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించుకోవడమే కష్టం.

# అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతాం

భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఈ జిల్లా పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే అగ్రస్థానానికి చేరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గతంలో వెనుకబడిన రంగారెడ్డి జిల్లా ఎలాగైతే సంపన్న ప్రాంతంగా మారిందో, విశాఖకు సమీపంలో ఉన్న అనకాపల్లిని కూడా మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ సోలార్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 6.5 గిగావాట్ల ఇన్‌గాట్-వేఫర్ తయారీ ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ రాష్ట్ర అభివృద్ధిపై తన ప్రభుత్వ దార్శనికతను ఆవిష్కరించారు.

**పెట్టుబడులతో పునర్నిర్మాణం**

గత ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించాలన్న ఏకైక లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు రెన్యూ ఎనర్జీ సంస్థ భారీ పెట్టుబడితో ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు

జయంత్ సిన్హా వేగంగా అభివృద్ధి చెందుతున్న సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం రాష్ట్రంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా, రాంబిల్లిలో సోలార్ ఫలకాల తయారీ పరిశ్రమ రావడం ద్వారా రాష్ట్రం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

**గ్రీన్ ఎనర్జీయే లక్ష్యం**

రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ రంగంలో రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. 90 గిగావాట్ల మేర ప్రతిపాదనలు, ఒప్పందాలు (ఎంఓయూలు) సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఒక్క ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ సంస్థే రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోందన్నారు. అభివృద్ధికి విద్యుత్ వినియోగం ఒక సూచిక అని, అందుకే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వివరించారు. దీనిలో భాగంగా పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, ఆర్టీసీ కూడా 1,050 గ్రీన్ బస్సులను ప్రవేశపెడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని చంద్రబాబు ఆరోపించారు. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) రద్దు చేయడం, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వంటి చర్యలతో రాష్ట్రం తీవ్రంగా

నష్టపోయిందన్నారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాన్ని మోపి 'ట్రూ అప్' ఛార్జీల రూపంలో వసూలు చేశారని విమర్శించారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తమ ప్రభుత్వం ప్రారంభించిన విద్యుత్ సంస్కరణల ఫలాలను ప్రజలకు అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# తెలంగాణలో నేటి నుంచే వేసవి సెలవులు

విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, నేడు (ఏప్రిల్ 23) విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలన్నీ వేసవి సెలవుల కారణంగా మూతపడనున్నాయి.

**సమ్మర్ హాలిడేస్ షెడ్యూల్:**

ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు మొత్తం 50 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి.

జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి.

సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు జరిగేవి, కానీ ఈ ఏడాది ఎండలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే సెలవులు ప్రకటించింది.

# జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరించిన ఏపీ శాసనమండలి ఛైర్మన్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమర్పించిన రాజీనామాను శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవి యథాతథంగా కొనసాగనుంది. వివరాల్లోకి వెళితే, 2024 నవంబరులో జయమంగళ వెంకటరమణ వైసీపీకి, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, తన రాజీనామాను ఛైర్మన్ ఉద్దేశపూర్వకంగా ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన గత ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, జయమంగళ రాజీనామాపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని మండలి ఛైర్మన్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది సైతం హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఛైర్మన్ మోషేన్ రాజు, జయమంగళ రాజీనామాను తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజీనామాకు జయమంగళ సమర్పించిన సమాధానం సంతృప్తికరంగా లేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల తర్వాత చోటుచేసుకున్న ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజీనామా తిరస్కరణకు గురవడంతో చట్టప్రకారం జయమంగళ ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు.కాగా, అప్పట్లో వైసీపీకి రాజీనామా చేసిన జయమంగళ వెంకటరమణ... పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

# తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్... రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇవాళ తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, పశ్చిమ బెంగాల్ లో 152 స్థానాల్లో తొలి విడత పోలింగ్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారీ ఉత్సాహం ప్రదర్శించారు.

ఎన్నికల సంఘం అంచనాల ప్రకారం, సాయంత్రం 5 గంటలకే పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం, తమిళనాడులో 82.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82 శాతం, 74 శాతం కంటే గణనీయంగా అధికం కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు తీవ్ర వివాదానికి దారితీసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డ్రైవ్ ప్రభావం ఏమాత్రం కనిపించకపోగా, పోలింగ్ శాతం ఊహించని స్థాయికి చేరడం విశేషం.తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే), తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. చెన్నైలో పోలింగ్ చివరి గంటలో, ఓటర్లు తమ హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. ఏఐఏడీఎంకే అభ్యర్థి డి. జయకుమార్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.ఈ ఎన్నికల్లో కన్యాకుమారి జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వెల్లివిరిసింది. రోడ్డు సౌకర్యం లేని మారుమూల కొండ ప్రాంతాలకు చెందిన 'కని' గిరిజన తెగ ప్రజలు, పెచిపారై డ్యామ్‌లో పడవలపై ప్రయాణించి వచ్చి మరీ ఓటు వేశారు. డ్యామ్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో, జిల్లా యంత్రాంగం లైఫ్ జాకెట్లతో కూడిన మూడు ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించింది. మరోవైపు, డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఎండీఎంకే నేత వైగో ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 16 జిల్లాల పరిధిలోని

152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, డార్జిలింగ్, జల్‌పాయ్‌గురి, దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, పురులియా, బంకురా వంటి జిల్లాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. మిగిలిన 142 నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఫలితాలు రెండు రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.

ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లు తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ... "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్విన్-ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. 'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు. సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కేవైసీ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు.కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

# అనంతబాబుకు సమాచారం అందించినట్టు ఆరోపణలు.. సీఐపై వేటు

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు పోలీసుల అంతర్గత సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో సర్పవరం సీఐ రవికుమార్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన రహస్య సమాచారాన్ని, పోలీసుల కదలికలను సీఐ రవికుమార్ ఎప్పటికప్పుడు అనంతబాబుకు చేరవేస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దర్యాప్తు పారదర్శకతను దెబ్బతీస్తూ నిందితుడికి సహకరించినందుకు గాను, ఏలూరు రేంజ్ ఐజీ ఆయనను తక్షణమే విధుల్లో నుంచి తప్పించి, వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశాలు జారీ చేశారు.

# అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం.. బెంగాల్‌ను విముక్తం చేయండి

- మొదటి పేజి తరువాయి

అక్రమంగా సరిహద్దు దాటి రానివ్వబోమని, ఇప్పటికే ఉన్న వారిని గుర్తించి పంపించివేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు దక్కాల్సిన రేషన్, ఉద్యోగాలను ఈ అక్రమ వలసదారులు లాగేసుకుంటున్నారని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఆటంకమని ఆరోపించారు.మీరు వేసే ఓటు కేవలం ఒక ఎమ్మెల్యే కోసమే కాదని, అక్రమ చొరబాటుదారుల నుంచి బెంగాల్ విముక్తి కోసం కూడా అని పేర్కొన్నారు. మే 5వ తేదీతో 'దీదీ' పాలన ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.నేడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి తొలి దశ (152 స్థానాలు) పోలింగ్ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికే దాదాపు 89 శాతానికి పైగా భారీ ఓటింగ్ నమోదైంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

# జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన ఒంటిమిట్ట అర్చకులు... టీటీడీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఈ ఆలయంలో పనిచేసే అర్చకులు ప్రొటోకాల్‌ను అతిక్రమించడంపై యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. వ్యక్తిగత హోదాలో రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లి ఆలయ మర్యాదలను పాటించకపోవడం సరికాదని భావించింది. ఈ నేపథ్యంలోనే సదరు అర్చకులపై చర్యలకు ఉపక్రమించింది. అర్చకులకు జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో రెండు రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని టీటీడీ స్పష్టం చేసింది. వారు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆలయ పవిత్రత, నియమ నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టీటీడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ నోటీసులపై అర్చకుల నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. వారి వివరణ అందిన తర్వాత టీటీడీ తదుపరి చర్యలు తీసుకోనుంది.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు.. కేంద్రం కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది.ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

**దేశంలో సాధారణంగానే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా**

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

# విద్యతోనే విలువలు సాధ్యం -- విద్యార్థులకు ఆర్ఐ నరేష్ పిలుపు






**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 23:** విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలని రీజనల్ ఇన్‌చార్జ్ ఎం.వి.ఎల్ నరేష్ సూచించారు. రావులపాలెంలోని శ్రీ చైతన్య స్కూల్లో వారం రోజులుగా నిర్వహించిన "ఫ్యామిలీ ఫెస్ట్" కార్యక్రమాల ముగింపు వేడుక గురువారం ఘనంగా జరిగింది. స్కూల్ ప్రిన్సిపల్ జగదీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవభావం కలిగి క్రమశిక్షణతో ముందుకు సాగితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని ఆయన పేర్కొన్నారు.
వేసవి సెలవులను వృథా చేయకుండా యోగా, మెడిటేషన్, వ్యాయామాలతో పాటు కంప్యూటర్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పట్టు సాధించాలని, అవసరమైతే ఉపాధ్యాయులు ఫోన్ ద్వారా అందుబాటులో ఉంటారని తెలిపారు. గోదావరి కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని విద్యార్థులకు హెచ్చరించారు. తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లలకు బాధ్యతలు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేసి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డీన్ ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

-ప్రత్తిపాడులోని అంగన్వాడీలు భారీ నిరసన ర్యాలీ.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఏప్రియల్, 23:** అంగన్వాడీలకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని అంగన్వాడీలు ప్రత్తిపాడులో భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద నిరసన తెలియజేసి వినతి పత్రం ఇవ్వాలని ఎ.పి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం స్థానిక ఫైర్ ఆఫీస్ నుండి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గత వైసిపి ప్రభుత్వం మినిట్సుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తామని హామీని రెండు సంవత్సరాలు పూర్తవుతున్న ఇప్పటికీ ఈ హామీలు అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు .2014 నుండి ఈనాటి వరకు కార్మికులకు వేతనాలు పెరగలేదని ధరలు ఆకాశానికి అంటాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంగనవాడీలకు ప్రభుత్వం వేతనాలు పెంచుతామని తెలంగాణ కమిటీ అదనంగా ఇస్తామని ఇచ్చిన హామీను తక్షణమే నెరవేర్చాలని, అలాగే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చట్టప్రకారం గ్రాడ్యుటీ అమలు చేసే విధంగా గైడ్లైన్స్ రూపొందించి అమలు చేయాలని ఈ సందర్భంగా అన్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడం కారణంగా అంగన్వాడీ సెంటర్లో పిల్లలకు ఈ మండుటల్లో ఇళ్లకు చేరుకోవడం వలన వడదెబ్బకు తగడంవలన అనారోగ్యానికి పాలవుతారని కావున అంగన్వాడీ సెంటర్లకు మే నెల అంతా సెలవులు ఇవ్వాలని ఈ సందర్భంగా అన్నారు .మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా స జీవోను విడుదల చేయాలని తదితర డిమాండ్లు పరిష్కారం కోసం కార్మికులు రావడం జరిగిందని సందర్భంగా అన్నారు .తక్షణమే ప్రభుత్వం అంగన్వాడీలు సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో స్థానిక నాయకులు యాళ్ళ జగదీష్ కి అంగన్వాడీలు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు, శంఖవరం ప్రాజెక్టు నాయకులు అల్లాడి లక్ష్మీ, జి.బుల్లమ్మ,కె.హేమలత,టి.నాగసత్యవతి,ఎన్.అమల ావతి,టి.చక్రకాంతం,కె.అచ్చిరాజు,పి.డి.ఎస్.కుమారి, బి.రత్న
కుమారి,బి.సత్యవేణి,కె.నూకరత్నం,బి.వరలక్ష్మి,బి.రత ్నం తదితరులు పాల్గొన్నారు.

# నిందితుడు అనంతబాబును రక్షిస్తున్న జగన్ మోహన్ రెడ్డి.

అనంతబాబును చట్టానికి అప్పగించకుంటే వైసీపీ కార్యాలయాలను ముట్టడిస్తాం.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, 23:** అనంతబాబును చట్టానికి అప్పగించకుంటే వైసీపీ కార్యాలయాలను ముట్టిస్తామని మహాసేన రాజేష్ హెచ్చరించారు.
అనంతబాబును జగన్ తన నివాసంలో దాచడం దారుణం అంటూ ఆరోపణ చేశారు.
హత్య కేసులో నిందితుడు అనంతబాబును తక్షణమే చట్టానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో దళితులకు జగన్ అన్యాయం చేశారని టీడీపీ నేత రాజేశ్ మహాసేనఅన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిబత్తుల వీరబాబు,బొండాడ నారాయుడు,మూరా వర ప్రసాద్,శెట్టిబత్తుల నానిబాబు,లాయర్ మధు బాబు, అధిక సంఖ్యలో దళిత నాయకులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.

-ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన
-మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు.
-ప్రత్తిపాడు ఎస్ఐ,ఎస్ లక్ష్మీకాంత హెచ్చరిక.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఏప్రియల్ 23:** రోడ్డు ప్రమాదాలను నివారించడంలో హెల్మెట్ వినియోగం కీలక పాత్ర పోషిస్తుందని ఎస్సై లక్ష్మీకాంతం పేర్కొన్నారు. ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గురువారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మీకాంతం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడే ముఖ్యమైన రక్షణ పరికరం హెల్మెట్ అని అన్నారు. చాలామంది నిర్లక్ష్యంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ భద్రత కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పోలీసులు వాహనదారులను ఆపి హెల్మెట్ అవసరాన్ని వివరించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యువత బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, వేగం నియంత్రణలో ఉంచాలని హెచ్చరించారు. హైవే కనెక్టివిటీ ఉన్న గ్రామాల ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మికాంతంతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద దళిత సంఘాల ఆందోళన

సాక్షులకు బెదిరింపుల ఆరోపణలు

**కాకినాడ పెన్ పవర్, ఏప్రిల్ 24:** దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసు వ్యవహారం కాకినాడలో మరోసారి ఉద్రిక్తతలకు దారితీసింది. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు సాక్షులను బెదిరిస్తున్నారంటూ దళిత సంఘాలు, తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం కాకినాడ రూరల్ ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు.
ముందుగా గురువారం వైసీపీ జిల్లా కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన దళిత నాయకులు, తమ ఆందోళనను రెండో రోజుకూ కొనసాగించారు. ఈ సందర్భంగా "జగన్ మోహన్ రెడ్డి దళిత ద్రోహి" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ, దళితులను ఓట్ల కోసం వినియోగించుకుని, దళిత యువకుడి హత్య కేసులో నిందితులను కాపాడటం అనైతికమని ఆరోపించారు. సుబ్రహ్మ ణ్యాన్ని దారుణంగా హత్య చేసిన అనంతబాబును వెనకేసుకురావడం వైసీపీ వైఖరిని బట్టబయలు చేస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు సూచనలు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసు తరహాలోనే ఈ కేసులోనూ సాక్ష్యాలను తారుమారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కోర్టులో అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే "మీ శవాలు కూడా దొరకవు" అంటూ బెదిరింపులు చేస్తున్నారని, సాక్షులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.3 లక్షల సుపారీ ఆఫర్ చేసినట్లు తెలిపారు. సిట్ దర్యాప్తులో సుబ్రహ్మణ్యం శరీరంపై 31 గాయాలు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో భయంతోనే సాక్షులను బెదిరిస్తున్నారని అన్నారు.



తక్షణమే సాక్షులకు పోలీసు రక్షణ కల్పించి, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్న అనంతబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, చాట్ర ఇమ్మనేయులు తదితర దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా 8వ జిల్లా స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమం

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి





**కాకినాడ, పెన్ పవర్ ఏప్రిల్ 23:** జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో 8వ జిల్లా స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణ, సరైన పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం.
ఈ కార్యక్రమానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డా.రాయిపాటి శైలజ, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎస్ఈపీసీఆర్ కమిటీ సభ్యులు ఎం.జే. సూర్యనారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై పోషణ పక్వాడ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డా.రాయిపాటి శైలజ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో పోషణ పక్వాడ కార్యక్రమం అత్యంత అవసరమైందని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోవడంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ అవసరమైందని తెలిపారు. ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు పలు పథకాల ద్వారా పోషకాహారం, వైద్య సేవలు అందిస్తోందని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ,ఈ నెల 9 నుండి గ్రామ, మండల స్థాయిలలో ప్రారంభమైన కార్యక్రమాలను నేడు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. జననం నుండి ఆరు సంవత్సరాల వరకు పిల్లల మెదడు అభివృద్ధి కీలక దశగా ఉండడంతో ఆ సమయంలో సరైన పోషకాహారం తప్పనిసరి అని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల శారీరక, మానసిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. జిల్లాలో ఏ ఒక్క చిన్నారికి పోషకాహార లోపం లేకుండా చూడటం లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు సరైన ఆహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పిల్లల ఆరోగ్యం సమాజ అభివృద్ధికి పునాది అని అన్నారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తుకు బలమైన ఆధారం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి మాట్లాడుతూ,ఈనెల 9 నుండి 23 వరకు జిల్లాలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్నపిల్లలను మొబైల్ ఫోన్ ప్రభావం నుండి దూరంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పిల్లల పెంపకంలో ఉత్తమ పాత్ర పోషించిన తల్లులను "సూపర్ మామ్స్"గా గుర్తించి సత్కరించడం ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోషకాహారంపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు, అవగాహన స్టాల్స్‌ను అతిథులు పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, మెప్మా పీడీ టి. కనకరాజు, డీసీపీవో వెంకటరావు, సీడీపీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తుకై 'శివ పోషణ' అవగాహన సదస్సు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 23:**మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారుల ఆరోగ్యకర భవిష్యత్తు లక్ష్యంగా "శివ పోషణ" అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం ర్యాలి గ్రామంలోని కోడ్ నెంబర్ 63, 3–జ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి శాఖ అధికారి ఏ. గజలక్ష్మి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా చిన్నారుల తొలి రెండేళ్ల వయస్సు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమని నిపుణులు వివరించారు. పిల్లల ఎదుగుదలలో 80 శాతం మెదడు అభివృద్ధి ఈ దశలోనే జరుగుతుందని పేర్కొన్నారు. అధిక స్క్రీన్ టైమ్ చిన్నారుల మానసిక, సామాజిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అలాగే ప్యాక్ చేసిన జంక్ ఫుడ్ వల్ల పిల్లల ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను ర్యాలి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాయి కిరణ్ వివరంగా తెలియజేశారు.

పిల్లలకు పోషకాహారం అందించడం, తల్లిదండ్రులు పిల్లలపై నిరంతర శ్రద్ధ వహించడం ఎంతో అవసరమని అధికారులు సూచించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, 0––6 సంవత్సరాల చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొని ఆరోగ్య సూచనలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల పోషణ, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

### విద్యా వెలుగులతో మెరిసిన 'సాంగ్ ఆఫ్ జాయ్' వార్షికోత్సవం



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 23:**డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం విద్యా సంబరాలతో కళకళలాడింది. గ్రామంలోని సాంగ్ ఆఫ్ జాయ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించగా విద్యార్థుల ప్రతిభ, విద్యా ప్రాధాన్యత, సామాజిక సేవల సందేశాలతో కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రతిభా ప్రదర్శనలతో సభా ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది.

ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ పి.ఎస్.ఆర్. రెడ్డి జైపాల్ మాట్లాడుతూ సమాజ మార్పుకు విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సంస్థ పనిచేస్తోందని తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించే దిశగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు.

స్కూల్ కరస్పాండెంట్ పల్నాటి ప్రవీణ్ మాట్లాడుతూ సాంగ్ ఆఫ్ జాయ్ విద్యార్థులు విద్యా, ఉపాధి రంగాల్లో ఉన్నత స్థానాలు సాధించడం సంస్థకు గర్వకారణమని అన్నారు. పేద , వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్య అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాల పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించడం గొప్ప సేవ అని కొనియాడారు. విద్య ద్వారా మాత్రమే సమాజంలో అసమానతలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. మరో అతిథి డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అనాథ పిల్లలకు ఉచిత విద్య అందించడం మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు.అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

### జయంతి వేడుకలలో సిహెచ్ లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ,



**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ ,23:**కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేసిన సీతానగరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నేత స్వర్గీయ గల్లా నాగరాజు (బాబి) 29వ జయంతి వేడుకలను కుటుంబ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. సిహెచ్ సూపర్డెంట్ ప్రణీత్ చేతుల మీదగా రోగులకు రొట్టెలు, పండ్లు అందించారు. అదేవిధంగా అన్నా క్యాంటీన్లో ఉదయం ఉచిత అల్పాహారము, మధ్యాహ్నం ఉచిత భోజనము అందించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ స్వర్గీయ గల్లా నాగరాజు మన మధ్య లేకున్నా ప్రజల గుండెల్లో ఉన్నారని వారు ఈ సందర్భంగా తెలిపారు. జయంతి వేడుకలను పురస్కరించుకుని రోగులకు పండు పంపిణీ, అన్నా క్యాంటీన్లో ఉచిత అల్పాహారము భోజనము అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు కుటుంబ సభ్యులు, స్నేహితులు ఉన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ డెక్కల పోలమ్మ అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నదానం






**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రియల్, 23:**గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామం 16వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని వేంచేసి ఉన్న శ్రీ శ్రీ డెక్కల పోలమ్మ అమ్మవారి ఆలయం వద్ద జాతరను పురస్కరించుకుని గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మాట్లాడుతూ అమ్మవారి జాతర మొదలుకొని భారీ అన్నదాన వరకు భక్తుల సహాయ సహకారాలతో నిర్వహించినట్లు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు తాళ్లూరు గ్రామ వాసులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. అంతేకాకుండా జాతీయ రహదారి పై వెళ్లే పలువురు వాహన చోదకులు కూడా అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమాలు ఆబోతుల అప్పారావు రెడ్డి, బోరా కృష్ణారెడ్డి తదితర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

### ఆదిత్య విశ్వవిద్యాలయం లో విలియం షేక్స్పియర్ జన్మదినం





**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 23** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య విశ్వవిద్యాలయం 23 ఏప్రిల్ 2026 న విలియం షేక్స్పియర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో–చాన్సలర్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఆంగ్ల సాహిత్య ప్రాముఖ్యత ను మరియు అది విద్యార్థులలో జీవన విలువలు ఎలా పెంపొందిస్తుంది వివరించారు. సాహిత్యం విమర్శనాత్మక ఆలోచన, అనుభూతి, నైతిక విలువలు అభివృద్ధి చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.మాతృభాష గొప్పదే అని కానీ నేటి పోటీ ప్రపంచంలో మనుగడ సాధించాలంటే ఆంగ్లభాషను తప్పని సరిగా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ డా. డి. జ్యోతిర్మయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె గ్లోసోఫోబియా –– నివారణ పద్ధతులు: ఏల్ ఎస్.ఆర్.డబ్ల్యు నైపుణ్యాల జోక్యం అనే అంశం పై ఉపన్యాసం అందించారు. ఈ ఉపన్యాసంలో గ్లోసోఫోబియా (ప్రజల ముందు మాట్లాడే భయం) గురించి వివరించి, దాన్ని అధిగమించడానికి అవసరమైన పద్ధతులు సూచించారు. వినడం, మాట్లాడడం, చదవడం, రాయడం నైపుణ్యాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఎంత ముఖ్యమో వివరించారు. అదనంగా, షేక్స్పియర్ 37 నాటకాలు, 154 సోనెట్లు రచించారని పేర్కొంటూ, ఆయన రచనలు సమాజంపై చూపిన శాశ్వత ప్రభావాన్ని వివరించారు.ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ పి.ఎస్. రంజిత్ మాట్లాడుతూ ఈ గ్లోబలైజేషన్ యుగంలో ఆంగ్ల భాష నేర్చుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అంతర్జాతీయ స్థాయి ఉద్యోగ అవకాశాలను పొందడానికి భాషా నైపుణ్యాలు అవసరమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మోనోలాగ్, డ్రాయింగ్, కథనం వంటి పోటీలు నిర్వహించి వీటిలో మొదటి, రెండవ, మూడవ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు . ఆదిత్య యూనివర్సిటీ తరపున ముఖ్య అతిథి డా. డి. జ్యోతిర్మయి ని దుశ్శాలువా జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డా. పి . సతీష్, డా.గిరజాల చిన్న రామ్ పాల్గొన్న ఈ కార్యక్రమం డా. కె. సువర్ణ లక్ష్మి సమన్వయం చేశారు.

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి.



**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 23:**ర్యాలి ప్రధాన ఫౌండేషన్ పాఠశాలలో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి ప్రధాన ఫౌండేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యాం కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మోహిత్ సీతలు హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. సాధారణంగా కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రమే జరిగే ఈ తరహా కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఎస్. నాగదేవి, ఉపాధ్యక్షురాలు కె. జ్యోతి, దాత అన్నపూర్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు పెంచుదాం



జాతీయ పర్యావరణ మిత్ర గంగాధర్

**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 23:** గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య యూనివర్సిటీ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ ఆఫీసర్ జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ "తరువు త్యాగానికి గురువు" తరువులు పెంచుదాం ధరణిని కాపాడుదాం.. అంటూ వాతావరణ మార్పులు పరిష్కరించడానికి మరియు జీవవైవిధ్యాన్ని రక్షించడానికి సమిష్టి కృషి యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. 55 సంవత్సరాల క్రితం 1970 లోనే ప్రపంచ పర్యావరణ సంస్థ ధరిత్రి ని కాపాడుకోవాలని ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ ధరిత్రి దినోత్సవం నిర్వహిస్తున్నారు అని తెలియజేసారు. అడవులు నరికి వేయడం వల్ల క్రమక్రమంగా అటవీ భూమి అంతరించి జంతుజాలం అంతరించిపోతుంది తరువులు తరిగిపోవడం వల్ల వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి.తద్వారా మానవులే కాకుండా సమస్త జీవులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది.. సకాలంలో వర్షాలు కురవక పంటలకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది.. వీటన్నింటికీ పరిష్కారం ఒక్కటే మొక్కలు విరివిగా పెంచడం, ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడం ద్వారా వాతావరణ సమతుల్యాన్ని కాపాడుకోవడానికి అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి సభ్యులు తోటకూర దుర్గా లక్ష్మి, పెంటకోట గంగాధర్,నాగదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఆదిత్య యూనివర్సిటీ లో ఎర్త్ వీక్ ఉత్సవాలు






**గండేపల్లి, పెన్ పవర్, ఏప్రిల్, 23:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ నందు ఎకో క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఎర్త్ వీక్ సంబరాలు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని పుట్టిన రోజు,పెళ్లి రోజు తదితర పర్వదినాలలో మొక్కలు నాటడం మొక్కలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టి ప్రకృతి పరిరక్షణ కొరకు మొక్కవోని దీక్షతో అందరూ ముందుకు రావాలని అన్నారు. కన్న తల్లి ఋణం... మాతృభూమి ఋణం ఎప్పటికీ తీర్చుకోలేము మనం నేడు చేస్తున్న కాలుష్యం వల్ల భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించలేమని అది గుర్తించే నాటి అమెరికా .."సెనేటర్ గెరాల్డ్ నెల్సన్" ధరిత్రి దినోత్సవం (ఎర్త్ డే) కు రూపకల్పన చేశారు అని డా. ఎం.ఎస్.రెడ్డి అన్నారు. మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది,అందుకే ప్రతి ఒక్కరు మొక్కలు పెంచడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువును,ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రో.వైస్ ఛాన్సలర్ డా.ఏ. రమేష్, రిజిస్ట్రార్ డా.జి.సురేష్,డీన్ లు డా. డి .కిషోర్, ప్రో.వి.సత్యనారాయణ, కో క్లబ్ కో.ఆర్డినేటర్. డా. బి.హెచ్.వరప్రసాద్,ప్రో.అన్నపూర్ణ,ఉపాధ్యాయులు ఎకో క్లబ్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పుస్తక దినోత్సవం.. బాలురకు పుస్తకాల పంపిణీ

**కాకినాడ పెన్ పవర్, ఏప్రిల్ 23:** స్థానిక అశోక్ నగర్‌లో ఉన్న నచికేత బాలుర ఆశ్రయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎన్ఎమ్ఓ (నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్) ఉపాధ్యక్షులు, శ్రీ సత్య దంత వైద్యశాల అధినేత డా. అడ్డాల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలురందరికీ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, "నీవు చదివే పుస్తకమే నీ వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని జరుపుకుంటామని, పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచడం, రచయితలను గౌరవించడం, అక్షరాస్యతను ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశ్యాలని తెలిపారు.ఈ రోజున ప్రముఖ రచయిత విలియం షేక్స్‌పియర్ వర్ధంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని చెప్పారు. "పుస్తకాలు లేని గది ఆత్మ లేని శరీరం వంటిది" అని పేర్కొంటూ, పుస్తకాలు మన గతం, వర్తమానం,భవిష్యత్తును కలిపే వారధిలా పనిచేస్తాయని వివరించారు.

నిత్యం పుస్తకాలు చదవడం వల్ల ఏకాగ్రత పెరగడంతో పాటు ఆలోచనా దృక్పథం మెరుగుపడుతుందని, ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు.స్మార్ట్‌ఫోన్ యుగంలో కూడా ఫిజికల్ పుస్తకాల ద్వారా లభించే అనుభూతి,జ్ఞానం ప్రత్యేకమని పేర్కొన్నారు.పుస్తకం మనిషికి అత్యంత విలువైన ఆస్తి అని, ఈ సందర్భంగా కనీసం ఒక కొత్త పుస్తకాన్ని చదివే అలవాటు చేసుకోవాలని,ఇతరులకు పుస్తకాలను బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. "జ్ఞానానికి తాళం చెవి పుస్తకమే" అని అన్నారు.ఈ కార్యక్రమంలో నచికేత ఆశ్రమంలోని బాలురు మరియు పర్యవేక్షకులు పాల్గొన్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వేసవి సెలవులకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇవ్వండి



జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు

**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 23:** వేసవి సెలవులకు కుటుంబ సమేతంగా ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో పిల్లలకు స్కూల్స్ సెలవు కారణంగా కుటుంబ సభ్యులంతా ఎక్కడకైనా ఊరెల్లే సందర్భం ఉంటే నగదు, బంగారం ఇతర విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్ లో దాచుకోవాలన్నారు. ఎక్కువ రోజులు ఊరులో ఉండనట్లయితే పోలీసులకు సమాచారం ఇస్తే గస్తీ పెంచుతామన్నారు. వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ పెంచామన్నారు. జగ్గంపేట చుట్టుపక్కల పరిధిలో సిసి కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఆటోలు, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు బంగారం, నగదు ఇతర విలువైన వస్తువులు వెంట ఉంచుకోవద్దని ఒకవేళ తప్పనిసరిగా అయితే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.


## విద్యా బాల మందిర్‌లో విద్యార్థులకు మెడల్స్ ప్రదానం




**కొత్తపేట, పెన్ పవర్, ఏప్రిల్ 23:** జనాభా లెక్కలు--2026 కార్యక్రమం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కొత్తపేటలోని విద్యా బాల మందిర్ పాఠశాలలో విద్యార్థులలో అవగాహన పెంపొందించేందుకు పలు పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆరో తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు ఏర్పాటు చేసి వారి ప్రతిభను ప్రోత్సహించారు.ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.జనాభా లెక్కల ప్రాధాన్యం, సమాజ అభివృద్ధిలో దాని పాత్ర వంటి అంశాలపై విద్యార్థులు విశ్లేషణాత్మకంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి మండల విద్యాశాఖాధికారి అందజేసిన మెడల్స్‌ను పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ చేతుల మీదుగా ఘనంగా ప్రదానం చేశారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామోజు అనురాధ మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రదానోపాధ్యాయులు నూకపేయి శివరత్నం మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు సమాజానికి సంబంధించిన అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ తదితర బోధకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సాక్షులను బెదిరిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలి




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 23:** దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు సాక్షులను తీవ్రస్థాయిలో భయభ్రాంతులకు గురిచేయడాన్ని నిరసిస్తూ జగ్గంపేటలో దళిత సంఘాలు, తెలుగుదేశం పార్టీ నాయకులు కదం తొక్కారు. అంబేద్కర్ నగర్ నుండి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి విగ్రహం ఎదురుగా ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు జగన్ మోహన్ రెడ్డి దళిత ద్రోహి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దళితుడిని చంపిన హంతకులకు జగన్ అడుగడుగునా కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా టిడిపి ఎస్సీ సెల్ జగంపేట మండల అధ్యక్షులు సాంబత్తుల చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని దారుణంగా కొట్టి చంపి, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన అనంతబాబుతో జగన్ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. దళితుల పట్ల జగన్ రెడ్డికి ఉన్న కపట ప్రేమకు, ఆయన దళిత ద్రోహి అనడానికి ఇదే నిదర్శనం అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తుమ్మల కిషోర్, కందరాడ చంద్ర రావు, బత్తుల స్వామి, తుమ్మల సన్నీ, బంటు బుచ్చిబాబు, దళిత నాయకులు పాల్గొన్నారు.

# భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న తుమ్మలపల్లి రమేష్




**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 23:** జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో నిర్వహించిన భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహర్షి భగీరథుడి విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ భగీరథ మహర్షి తపస్సు, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సగర సంఘం అధ్యక్షులు గుర్రం అబ్బు, ఎంపీటీసీ దొడ్డా శ్రీను, ఒమ్మి రఘురామ్, ములికి వీర రాఘవ, మర్రిపాక ఆంజనేయులు, గాది వీర్రాజు, గుర్రం రాంబాబు,మాదారపు వీరబాబు, కాయల మణికంఠ, పాలేం బాబీ, కొలమూరి వీర భద్ర, రేవూరి శ్రీను, దొడ్డి శ్రీను, గోకేడ పండు, వంశీ తదితరులు పాల్గొన్నారు. అలాగే జగ్గంపేట మండలం గొల్లలగుంట సగరపేట లో నిర్వహించిన భగీరథ మహర్షి జయంతి ఉత్సవంలో తుమ్మలపల్లి రమేష్ పాల్గొని భగీరథుడి విగ్రహానికి పూలమాలలు వేశారు.

## కొత్తపేటలో అంగన్వాడి వర్కర్ల ర్యాలీ





**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్ 23:** సిఐటియు ఆధ్వర్యంలో కొత్తపేట ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడి వర్కర్లు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేస్తూ సమగ్ర శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. అనంతరం ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించి తమ సమస్యల గురించి వివరించారు.ఈ సందర్భంగా వర్కర్లు మాట్లాడుతూ మే నెల మొత్తం సెలవులు మంజూరు చేయాలని, అదనపు డ్యూటీలు వేయకూడదని, తగిన గ్రాడ్యుటీతో పాటు జీతాలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలు సవరించాలని, పని భారాన్ని తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

## రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం



**కాజులూరు, పెన్ పవర్,ఏప్రిల్ 23:**కాజులూరు మండలం పరిధిలోని గొల్లపాలెం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు తలాటం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యమైన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. రైతులకు సరైన ధరలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. అశోక్, జిల్లా సహకార అధికారి బి. శ్రీనివాస్ రెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## జూన్ 14వరకు సముద్రంలో వేట నిషేధం



**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 23:**ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేట నిషేధం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్య సంపద పరిరక్షణ దృష్ట్యా ప్రతి సంవత్సరం తల్లి చేపలు గుడ్లు పెట్టే కాలంగా భావించే ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో ఇంజన్‌తో చేపల వేట నిర్వహించే బోట్లపై నిషేధం విధించింది.ఈ నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు ప్రభుత్వం "మత్స్యకారుల సేవ" పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 20,000 చొప్పున భృతి అందించేందుకు ఆదేశాలు జారీ చేసింది.ఈ ఆదేశాల అమలులో భాగంగా కాకినాడ జిల్లాలో ఏప్రిల్ 18, 2026న మత్స్యకారుల పడవల ఎన్యుమరేషన్ నిర్వహించబడింది. మొత్తం 4,602 బోట్లకు చెందిన 27,070 మంది మత్స్యకారుల వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేశారు.ఈ డేటా ఆధారంగా ప్రాథమిక లబ్ధిదారుల జాబితాను ఏప్రిల్ 23, 2026న సంబంధిత స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు కార్యాలయాలు మరియు రైతు సేవా కేంద్రాల్లో ప్రచురించారు.ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, ఏప్రిల్ 25, 2026 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత గ్రామ మత్స్య సహాయకులు లేదా మత్స్య శాఖ అభివృద్ధి అధికారికి వ్రాతపూర్వకంగా తెలియ జేయాలని అధికారులు సూచించారు. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది జాబితాను సిక్స్ స్టెప్ వాలిడేషన్‌కు పంపిస్తామని తెలిపారు.మత్స్యకారులు ఈ విషయాన్ని గమనించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణారావు కోరారు.

## రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మిని పరామర్శించిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను తాటిపాక గ్రామంలోని స్వగృహానికి వెళ్లి కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ఆమెకు ధైర్యం చెప్పి, త్వరగా పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ప్రజలకు సేవ చేసే నాయకుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆమె త్వరగా కోలుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ నాయకులు దొంగ శ్రీను,గుబ్బల శ్రీను,స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.?

## ఎమ్మెల్సీ అనంతబాబును తొలగించాలని డిమాండ్ -- కొత్తపేటలో ఎస్సీ సంఘాల ఆందోళన




**కొత్తపేట,పెన్ పవర్, ఏప్రిల్23:** డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడైన ఎమ్మెల్సీ అనంతబాబును తక్షణమే అరెస్టు చేసి, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ కొత్తపేటలో ఎస్సీ సంఘాలు గురువారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి.రామారావుపేట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ముగిసింది. అక్కడికి చేరుకున్న నిరసనకారులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అనంతబాబు మీద చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు నమోదై మూడేళ్లు గడిచినా,ఇప్పటికీ ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించకపోవడం దారుణమని విమర్శించారు.అనంతబాబు బయట ఉండటం వల్ల సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, వెంటనే అతనిని మరియు అతని సతీమణిని అరెస్టు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ నిరసనలో పల్లి భీమారావు, బూసి భాస్కర్ రావు, కముజు శ్రీనివాస్ రావు, సాదే శ్రీనివాస్, నల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ అభ్యున్నతి కోసం భగీరథుడు చేసిన కృషి అందరికీ ఆదర్శం





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 23:**కలెక్టరేట్‌లో ఘనంగా శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలుకాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు,జిల్లా రెవెన్యూ అధికారి డా. టి.తిప్పేనాయక్,సగర సంక్షేమ సంఘం నాయకులు భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, సమాజ అభ్యున్నతి, సమాజ హితం కోసం పట్టుదలతో, సంకల్పబలంతో భగీరథుడు చేసిన తపస్సు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో భగీరథుని జయంతిని నిర్వహిస్తున్నామని తెలిపారు. గంగను భూమికి తీసుకువచ్చినమహనీయుడిగా భగీరథుడు చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయడం వంటి విలువలు ఆయన జీవితంలో స్పష్టంగా కనిపిస్తాయని కొనియాడారు. తన పూర్వీకుల విమోచనార్థం గంగను భూమికి తీసుకురావడానికి భగీరథుడు చేసిన అపార తపస్సు నేటి తరానికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. "భగీరథ ప్రయత్నం" అనే పదం కఠినమైన లక్ష్యాన్ని సాధించేందుకు చేసిన మహత్తర కృషిని సూచిస్తుందని తెలిపారు. పట్టుదలతో కృషి చేస్తే అసాధ్యమేమీ లేదని, యువత భగీరథుని జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి ఏ. శ్యామల కుమారి,బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ. శ్రీనివాసరావు,పి.రామకృష్ణ, సగర కార్పొరేషన్ డైరెక్టర్లు,సంక్షేమ సంఘాల నాయకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో జరుగు మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి.




**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరుగు మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సునీత గురువారం పిలుపు నిచ్చారు. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాను ఏపీఎస్ఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ -- స్కిల్ ఏపీ , వికాసా కాకినాడ) సహకారంతో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరుకానున్నారు.ఈ మెగా జాబ్ మేళాలో ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, డిప్లొమా , డిగ్రీ పూర్తి చేసి 35 సంవత్సరాల వయస్సు లోపు అభ్యర్థులు పాల్గొనవచ్చునని, అభ్యర్థులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని అన్నారు .ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ 10,000 నుండి రూ. 23,000 వరకు జీతం , ఇంటెన్సివ్ , రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాల బట్టి ఉంటుందని, జాబ్ మేళా లో పాల్గొనే కంపెనీలు ఐసాన్ ఎక్స్‌పీరియెన్స్ ,చోళమండలం గోల్డ్ లోన్, యాక్సిస్ బ్యాంక్ , డెక్కన్ కెమికల్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, సుందరం ఫాస్టెనర్స్ లిమిటెడ్, అపోలో టైర్స్ లిమిటెడ్, ఇసుజు మోటార్స్ లిమిటెడ్, ఇండోమిమ్, అపోలో ఫార్మసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా కార్డ్స్, ఎస్‌బీఐ పేమెంట్స్ , ఎస్‌బాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్,పంజాబ్ నేషనల్ బ్యాంక్ కార్డ్స్ ,హ్యుందాయ్ మొబిస్ , సన్‌వింకో సోలార్ ఎనర్జీ లు అభ్యర్థులకు ఎంపిక చేసుకుంటాయని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, అర్హత ధృవ పత్రాలతో నేరుగా ఫార్మల్ డ్రస్ కోడ్‌లో హాజరుకావాలని సూచించారు. ఈ జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు విస్తృతంగా లభించనున్నాయని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కోరారు.

## అనంతబాబు లొంగిపోవాలి..



- జగన్ నేరస్తులకు కొమ్ము కాయడం మానుకోవాలి
- టీడీపీ నేతలు

**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 23:** కాకినాడ నగరంలో డ్రైవర్, దళిత సామాజిక వర్గానికి చెందిన వీధి సుబ్రమణ్యం హత్య కేసులో ముద్దాయిగా ఉన్న ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ బాబు (అనంతబాబు) రెండు రోజుల్లో లొంగిపోవాలని, లేనిపక్షంలో తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని లక్షలాది దళితులతో ముట్టడిస్తామని తెలుగుదేశం పార్టీకి చెందిన దళిత నాయకుడు సరిపల్లి రాజేష్ హెచ్చరించారు.అలాగే నేరస్తులకు కొమ్ముకాయడం మానుకోవాలని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి దళిత నేతలు హితవు పలికారు.దళితులకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆయనను అడ్డుకుంటామని తెలిపారు. గురువారం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో, అనంతబాబును కాపాడుతున్నారంటూ కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

జగన్ పాలనలో దళితులపై దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. దళితుల రక్షణ కోసం చంద్రబాబు పనిచేస్తున్నందున తాము టీడీపీలో ఉన్నామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే దళితులే వైసీపీకి తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సరిపల్లి రాజేష్, అంబటి చిన్నా, పలివెల రవి అనంత కుమార్, పోలేపల్లి జగన్, కొల్లాబత్తుల అప్పారావు, బంగారు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏడు వారాల వెంకన్న దర్శనానికి భక్తుల రద్దీ





**ఆత్రేయపురం పెన్ పవర్ ఏప్రిల్ 23:**ఏడు వారాల వెంకన్న దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. గురువారం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర, నిత్య కళ్యాణం పూజల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు.అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరాళాలు అందజేశారు. నిడమర్రు మండలం పెద్దనింద్రకొలను గ్రామానికి చెందిన చిటికిరెడ్డి అప్పారావు--లక్ష్మి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి రూ.50,101 విరాళంగా సమర్పించగా, అమలాపురానికి చెందిన కాడిధర్మారావు-- మంగతాయారు దంపతులు రూ.25,001 విరాళం అందజేశారు.విరాళదాతలను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

## సమాజ అభ్యున్నతి, హితం కోసం భగీరథుడు చేసిన కృషి అందరికీ ఆదర్శం-ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, ఏప్రిల్ 23:** సమాజ అభ్యున్నతి, సమాజ హితం కోసం పట్టుదల, సంకల్ప బలంతో శ్రీ భగీరథడు చేసిన తపస్సు, కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. బుధవారం భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం జగ్గంపేట మండలంలోని గుర్రంపాలెం సగరపేట, మన్యంవారిపాలెం, రాజపూడి, రామవరం గ్రామాలలో ఘనంగా జరిగింది. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై భగీరథ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం పోలవరం గట్టు పైన కాపు కళ్యాణ మండపం పక్కన సగరులకు ఎకరం స్థలంలో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అనంతరం భారీ ర్యాలీగా కాపు సామాజిక భవనానికి చేరుకుని సభ నిర్వహించారు.

ఈ సభలో జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నియోజకవర్గంలో శ్రీ భగీరథుని జయంతి ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. భగీరథుడు గంగను భూమికి తీసుకువచ్చిన మహనీయుడిగా చరిత్రలో నిలిచారని ఆయన తెలిపారు. భగీరథుని పట్టుదల, సంకల్పబలం, సమాజ హితం కోసం ఆయన చేసిన తపస్సు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఆయన అన్నారు. ప్రజల సంక్షేమం కోసం, అంకితభావంతో పనిచేయడం వంటి విలువలు భగీరథుని జీవితంలో మనకు స్పష్టంగా కనిపిస్తాయని కొనియాడారు. భగీరథుడు తన పూర్వీకుల విమోచనార్థం గంగను భూమికి తీసుకురావడంలో అపారమైన తపస్సు చేసి సాధించిన విజయాన్ని గుర్తుచేసుకుంటూ, నేటి తరానికి ఆయన జీవితం ప్రేరణగా నిలుస్తుందని నెహ్రూ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, ములికి సత్యనారాయణ, పోంద్రు బాలనాగు, పోట్రు కృష్ణ, గుర్రం మహాలక్ష్మి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ లు మొగిలి అప్పారావు, ములికి సూరిబాబు, నక్క కిషోర్, పోట్రు రాముడు, చనిబోయిన నూకరాజు, తంగెళ్ల అప్పారావు, అధిక సంఖ్యలో సగరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# అంగరంగ వైభవంగా జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షిక దినోత్సవం.





**పాఠశాల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం కీలకం.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, ఏప్రిల్ 23**: మండల పరిధి యర్రవరం గ్రామం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యన్. కన్నబాబు పాఠశాల వార్షిక నివేదికను ప్రకటించారు.నివేదికలో భాగంగా పీఎం శ్రీ కార్యక్రమాల కింద నిర్వహించిన విద్యా వైజ్ఞానిక విహారయాత్రలు, జాతీయ పండుగల వేడుకలు, నో బ్యాగ్ డే కార్యక్రమాలు, స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు తదితర అంశాలను వివరించారు. అలాగే పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధి, జి.ఎఫ్.ఎల్.ఎన్., బ్రిడ్జ్ కోర్స్ అమలు, తల్లిదండ్రులు-- పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు, విద్యార్థుల విద్యా , సహ పాఠ్యాంశాలలో సాధించిన ప్రగతి, వైద్య ఆరోగ్య కార్యక్రమాలు, జల్ పక్వాడ కార్యక్రమం, భారతీయ జనగణన 2027 స్వీయ గణాంక విధానం వంటి అంశాలపై విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

పాఠశాల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం ఎంతో కీలకమని, అందరూ తమ వంతు సహకారం అందించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు వేసవి సెలవుల సమయంలో అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు, ఎన్ఎంఎంఎస్ , నవోదయ ప్రవేశ పరీక్షలకు శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్, శాస్త్రీయ నృత్యం, సంగీతం వంటి అంశాలలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే భారతీయ జనగణన 2027 సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.చివరిగా విద్యార్థులు సమాజ సందేశాత్మక గీతాలు, జానపద నృత్యాలు, విద్యా ప్రేరణాత్మక కార్యక్రమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమాల రూపకల్పనలో విశేష కృషి చేసిన వ్యాయామ శాస్త్ర ఉపాధ్యాయురాలు జి. స్వరూపారాణి ని ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.ఈ వార్షికోత్సవం విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబిస్తూ, పాఠశాల అభివృద్ధి దిశగా మరొక ముందడుగు వేసిన సందర్భంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు సంఘం రమేష్, రత్న కుమారి , ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమీక్ష

### మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశం .. జిల్లా కలెక్టర్





**కాకినాడ, పెన్ పవర్,ఏప్రిల్ 23:** జిల్లాలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ గురువారం కలెక్టరేట్ కోర్ట్ హాల్‌లో ప్రాథమిక, సెకండరీ ఆరోగ్య విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సెకండరీ హెల్త్ విభాగంపై సమీక్షలో భాగంగా తుని ఏరియా ఆసుపత్రి, జిల్లాలోని 9 సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి గర్భిణికి పుట్టుక ప్రణాళికను పకడ్బందీగా అమలు చేసి, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో ఎక్కువ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. దీంతో కాకినాడ జీజీహెచ్‌పై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. అన్ని ఆసుపత్రుల్లో స్పెషలిస్టుల వారీగా జరిగే శస్త్రచికిత్సల వివరాలు నమోదు చేసి, నిపుణుల పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో గుండెపోటు చికిత్స కోసం అమలవుతున్న స్టెమీ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. మాతా-శిశు సంరక్షణ కార్యక్రమాలను బలోపేతం చేసి మాతృ, శిశు మరణాలను నివారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంటి శస్త్రచికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీసీహెచ్ఎస్ డా. కె. మహేశ్వరరావుకు ఆదేశించారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య సంరక్షణపై డీఎంహెచ్ఓ డా. జె. నరసింహా నాయక్, ప్రోగ్రాం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు నిర్వహించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణీ స్త్రీల నమోదు, ఈహెచ్ఆర్, ఏబీహెచ్ఏ నమోదు అంశాల్లో 100 శాతం సాధించాలని సూచించారు. గత సంవత్సరం సంభవించిన వ్యాధి వ్యాప్తి ఘటనలపై చర్చించి నివారణ చర్యలను బలోపేతం చేయాలని తెలిపారు.జిల్లాలో మలేరియా, డెంగ్యూ, కుష్ఠు, క్షయ వంటి వ్యాధుల నియంత్రణపై సమీక్షించారు. గతంలో నమోదైన మాతృ మరణాలపై కారణాలు తెలుసుకుని, గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ మాతృ, శిశు మరణాలను తగ్గించాలని సూచించారు. అలాగే బీపీ, షుగర్ వంటి అసంక్రమిత వ్యాధులపై జరుగుతున్న సర్వే 4.0 స్క్రీనింగ్ పనితీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా వడదెబ్బ, మలేరియా నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన గోడపత్రికలు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డా. వి.అరుణ,డా.జి.లక్ష్మి,డా.ఐ.ప్రభాకర్, డా.ప్రత్యూష,డా.శ్రీ విద్య, సెక్షన్ అధికారులు టి.నీలవేణి,కె. సూర్యచంద్రరావు,స్వరూప్,చీకట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వర్మీ కంపోస్ట్ ఎరువుల వినియోగంపై అవగాహన




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 23:**పశ్చిమగోదావరి మరియు ఏలూరు జిల్లాలో అధిక మోతాదులో యూరియా మరియు డి.ఏ.పి వినియోగం జరగడం వలన నేల ఆరోగ్యం మరియు పంట ఉత్పాదకత తగ్గడం జరుగుతుంది. దీనికి ప్రత్యాయంగా సమతుల్య ఎరువులు వినియోగం, సేంద్రియ ఎరువులు వాడటం, పచ్చ రొట్టె ఎరువులు, జీవన ఎరువులు మరియు వర్మి కంపోస్టుల వినియోగించడం ద్వారా రైతులు అవసరమైన రసాయన ఎరువులు మాత్రం వాడడం వలన ఖర్చు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యం, పంట ఉత్పత్తి మరియు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు. దీనిలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరమణ గూడెం డాక్టర్ వై. ఎస్ ఎస. ఆర్ .హెచ్.యు, విశ్వవిద్యాలయం వారు ఏలూరు జిల్లాలో గల నాచుగుంట గ్రామంలో రైతులకు వర్మీ కంపోస్ట్ ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం భాగంగా రైతులకు వానపాముల ఎరువుల తయారీ నిర్వహణ మరియు వినియోగం పూర్తిస్థాయిలో వాటి విధానాన్ని చేసి చూపించి రైతులకు వాటి లాభాలను తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి. హెచ్.కిరణ్ కుమార్ సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి, రైతులతో వానపాముల ఎరువుల వినియోగం వలన కలిగే లాభాలను తెలియజేశారు. డాక్టర్ శాస్త్రవేత్త మధ్యాహ్నం ఉద్యన పంటల్లో వానపాములు ఎరువుల వాడడం గూర్చి రైతులకు తెలియజేయడం జరిగింది.

## వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మహిళల మూల్యం తప్పదు





- రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి హెచ్చరిక
- మహిళా బిల్లును ఓడించిన నేపథ్యంలో కూటమి మహిళలు వినూత్న నిరసన

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23** :పార్లమెంట్‌లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతి పక్షాలు ఓడించిన నేపథ్యంలో బిజెపి మహిళా మోర్చ ఆధ్వర్యంలో గురువారం కూటమి పార్టీల మహిళలు నల్ల చీరలు ధరించి వినూత్నంగా నిరసన ప్రదర్శన చేశారు. నిరసన ప్రదనకు రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నాయకత్వం వహించారు. స్థానిక పుష్కర ఘాట్ వద్ద కూటమి పార్టీల మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యి పాదయాత్రగా శివుని బొమ్మ , మెయిన్ రోడ్డు మీదుగా స్థానిక రాయల్ మసీదు వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మహిళా బిల్లుకు వ్యతిరేకించిన ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎంపీ శ్రీమతి పురందేశ్వరి మాట్లాడుతూ, దేశ మహిళలు ఎంతో కాలంగా ఎదురు చూస్తూన్న చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలకు ముందుకు వచ్చిన బిజెపి ప్రయత్నాలను ప్రతిపక్షాలు అడ్డుకోవడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళల నుంచి భారీ మూల్యం చెల్లించుకుంటాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి కి మహిళల సాధికారత పట్ల చిత్తశుద్ధి లేదని బిల్లును ఓడించడంతోనే తెలుస్తుందన్నారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో గత మహిళల, బాలికల సంక్షేమానికి ,అభివృద్ధికి ఎన్నో పథకాలను దేశవ్యాప్తంగా తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బిజెపి జిల్లా మహిళా అధ్యక్షురాలు పాలడుగుల శ్రీవిద్య, కూటమి పార్టీల నాయకురాళ్ళు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పలువురు పాల్గొన్నారు.

## సాయిదీపిక నగర్ లో రూ. 28.50 లక్షలతో ఫ్రూట్ పార్క్ ప్రారంభం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**నగర ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని పంచేలా పార్కుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. ప్యాకేజీ-1 లో భాగంగా 10వ వార్డులో రూ. 28.50 లక్షలతో అభివృద్ధి పరిచిన సాయిదీపిక నగర్ పార్కును (ఫ్రూట్ పార్క్) ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, నగర కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కాసేపు సరదాగా షటిల్ ఆడి ఉత్తేజాన్ని నింపారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఈ పార్కు అడవిని తలపించేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్క్ రూపురేఖలే మారిపోయినట్లు వెల్లడించారు. ఈ పార్క్ లో గ్రీనరీని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పార్కులో పండ్ల పేర్లు, వాటి ఉపయోగాల గూర్చి చిన్నారులు చెబుతుండటం సంతోషాన్ని కలిగించిందన్నారు. కాలనీవాసులు కమిటీగా ఏర్పడి పార్కును సంరక్షించుకోవలసిందిగా సూచించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, అన్ని వయసుల వారిని అలరించే విధంగా ఈ ఫ్రూట్ థీమ్ పార్క్ ను తీర్చిదిద్ది నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, నగరంలోని పార్కులను ప్రత్యేక థీమ్ లతో నగరవాసులను, పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. సాయిదీపిక నగర్ పార్కును విశాలమైన వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు, యోగా ప్రాంగణం, ఓపెన్ జిమ్‌తో పాటు చిన్నారులకు ఆట వస్తువులు, పచ్చని గార్డెనింగ్ తో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. చిన్నారులు పండ్ల పేర్లను గుర్తించి, వాటి ఉపయోగాలను తెలుసుకునే విధంగా బోర్డులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## కోనసీమలో విద్యార్థుల హక్కుల ఉల్లంఘనపై ఎన్‌హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట పట్టణంలో ఉన్న డా. పి.ఎస్.సి.ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలుర ప్రవేశాలను నిలిపివేయాలన్న నిర్ణయంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ), ఢిల్లీకి ఫిర్యాదు చేసినట్లు హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ బాలు అక్కిస తెలిపారు. ఈ ఫిర్యాదు డైరీ నెంబర్ 8812/×చీ/2026గా నమోదు అయిందన్నారు.మండపేటలోని ఈ పాఠశాలలో ప్రస్తుతం 447 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, వారిలో 91 మంది బాలురు ఉన్నారు. పాలివాల విద్యాసాగర్ (14) సహా మరో 90 మంది బాలురు ఈ పాఠశాలలో చదువుతున్నారని పేర్కొన్నారు. ఈ పాఠశాల పరిధిలో సుమారు 12,500 మంది ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల ప్రజలు నివసిస్తున్నారని తెలిపారు.ఏప్రిల్ 18న జిల్లా విద్యాశాఖ అధికారి పి. నాగేశ్వరరావు ఆర్‌సీ నెం. 794/ఎ1/2026 ద్వారా 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాలలో బాలురను చేర్చుకోవద్దని, ప్రస్తుతం చదువుతున్న బాలురను ఇతర పాఠశాలల్లో చేర్చాలని మండపేట మండల విద్యాధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఈ నిర్ణయం బాలల మానవ హక్కులకు విరుద్ధమని, అలాగే ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు చట్టం--2009ను ఉల్లంఘించడమేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలురను ఇతర పాఠశాలకు పంపడం వల్ల వారు బడి మానేసే ప్రమాదం ఉందని, దూరప్రాంత పాఠశాలకు వెళ్లాల్సి రావడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కాబట్టి, సంబంధిత ఉత్తర్వులను తక్షణమే నిలిపివేసి, బాలురను అదే పాఠశాలలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ఆర్‌సీని అభ్యర్థించినట్లు బాలు అక్కిస తెలిపారు.

# సన్‌రైజర్స్‌లోకి ప్యాట్ కమిన్స్.. కెప్టెన్సీ మార్పుపై SRH కన్‌ఫ్యూజన్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 ఎడిషన్ లో సన్‌రైజర్స్ హైదరా బాద్ అద్భుతంగా ఆడుతుంది. వరుసగా 3 విజయా లతో పాయింట్ల పట్టికలో దూసుకుపోతోంది. కానీ జట్టు విజయాలతో ముందుకు సాగుతున్న తరుణంలో కెప్టెన్సీకి సంబంధించి ఓ పెద్ద చర్చ స్టార్ట్ అయింది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ జట్టుతో చేరడంతో ప్రస్తుతం కెప్టెన్‌గా ఉన్న ఇషాన్ కిషన్ నుంచి బాధ్యతలు తప్పుకునే ఛాన్స్ ఉందనేది.. అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ సీజన్ ఆరంభంలో ప్యాట్ కమిన్స్ గాయంతో అందుబాటులో లేకపోవడంతో జట్టు యాజమాన్యం అనూహ్యంగా యువ ప్లేయర్ ఇషాన్ కిషన్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. ఆరంభంలో కొన్ని ఓటములు ఎదురైనప్పటికీ.. ఇషాన్ తన నాయకత్వ పటిమతో జట్టుకి మళ్లీ విజయాలు అందించాడు. ముఖ్యంగా బౌలర్లను ఉపయోగించుకోవడంతో పాటు ఫీల్డింగ్ సెట్ చేయడంలో కిషన్ చూపిన పరిణతి చూస్తున్నాడు. ఇషాన్ కిషన్ కెప్టెన్సీని కొనసాగించాలని మాజీ క్రికెటర్లు గట్టిగా వాదిస్తున్నారు. హైదరాబాద్ జట్టు ప్యాట్ కమిన్స్ వైపు వెళ్లాలనే ఆలోచన చేయొద్దని సూచించారు. ప్రస్తుత సెటప్‌లో ఇషాన్ సారథ్యంలో జట్టు చాలా సమతుల్యంగా కనపడుతుంది. గత 5 మ్యాచ్‌ల్లో 4 గెలిచిన టీమ్ లో మార్పులు చేయడం అనవసరం అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. ప్యాట్ కమిన్స్ 2024లో జట్టును ఫైనల్‌కు చేర్చినప్పటికీ.. ప్రస్తుత ఫామ్ ఇషాన్‌కు అనుకూలంగా ఉందన్నాడు. మాజీ కోచ్ సంజయ్ బంగర్ కూడా ఇషాన్ కిషన్ కి సపోర్టు చేశాడు. ప్యాట్ కమిన్స్ వెన్నునొప్పి గాయంతో బాధపడుతున్నాడని.. దీనివల్ల అతను గత టీ20 ప్రపంచ కప్‌కు కూడా దూరంగా ఉన్నాడని గుర్తు చేశారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కమిన్స్.. ఐపీఎల్ లాంటి సుదీర్ఘ టోర్నీలో పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉంటాడా అన్నది అనుమానమేనని సంజయ్ పేర్కొన్నారు. ఇషాన్ కిషన్ గ్రౌండ్లో ఆటను నియంత్రించే తీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. హైదరాబాద్ జట్టు యాజమాన్యం ఇప్పుడు కన్‌ఫ్యూజన్ లో పడింది. ఓ వైపు ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి రావడం.. మరోవైపు వరుస విజయాలతో జోరు మీదున్న యంగ్ కెప్టెన్ ఇషాన్ కిషన్.. ఎవరినీ కెప్టెన్సీగా ఉంచాలనే నిర్ణయంపై మదనపడుతుంది. మరి ఆరెంజ్ ఆర్మీ అనుభవానికి ఓటేస్తుందో లేక విజయం తెచ్చిపెడుతున్న యువ రక్తాన్ని నమ్ముతుందా అనేది వేచి చూడాలి.

# మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తా: వైభవ్ సూర్యవంశీ

**ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచిన వైభవ్**

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న యువ సంచలనం నిజాయతీ వ్యాఖ్యలు**

**వేగవంతమైన 500 పరుగుల ఘనతలో మ్యాక్స్‌వెల్ ను అధిగమించిన సూర్యవంశీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. నిన్న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 8 పరుగులే చేసినప్పటికీ, ఐపీఎల్ చరిత్రలో 500 పరుగులు పూర్తి చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

అంతేగాక ఎదుర్కొన్న బంతుల పరంగా వేగంగా ఈ మైలురాయిని చేరుకుని, ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ పేరిట ఉన్న రికార్డును కూడా వైభవ్ బద్దలుకొట్టాడు. ఈ ఘనత సాధించిన తర్వాత అతను పంచుకున్న విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ... "నా బుర్రలో పెద్దగా ఏమీ ఆలోచించను. ఇప్పటికీ ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తాను. అది నాకు అలవాటు. అయితే, ఆటపైనే పూర్తి ఫోకస్ ఉంటుంది" అని నవ్వుతూ చెప్పాడు. చిన్న వయసులోనే స్టార్‌డమ్ వచ్చినా, తనలోని చిన్నపిల్లల అలవాటును నిజాయతీగా చెప్పడంతో నెటిజన్లు అతనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

"తర్వాతి మ్యాచ్‌లో కచ్చితంగా బాగా ఆడతాను. ఈ విజయంతో రెండు పాయింట్లు సాధించాం. ప్లేఆఫ్స్ దిశగా ముందుకు వెళ్తాం" అని వైభవ్ ధీమా వ్యక్తం చేశాడు.

# ఫిఫా వరల్డ్ కప్‌లో రాజకీయ ప్రకంపనలు.. ఇరాన్ స్థానంలో ఇటలీకి అవకాశం?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్ అయిన ఫిఫా వరల్డ్ కప్‌కు రాజకీయ వివాదాల సెగ తగిలింది. జూన్ 11 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నమెంట్‌లో అర్హత సాధించిన ఇరాన్ జట్టును తప్పించి, దాని స్థానంలో ఇటలీని చేర్చాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి ఒకరు ఫిఫాకు సూచించినట్లు సంచలన వార్తలు వెలువడుతున్నాయి. పోప్ లియో శ×ం పై ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో చెలరేగిన రాజకీయ వివాదాన్ని చల్లార్చేందుకే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది.అమెరికా వలస విధానం, ఇరాన్‌తో యుద్ధం వంటి అంశాలపై పోప్ లియో శ×ం వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' మీడియా వేదికగా ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పోప్ నేరాలను అరికట్టడంలో బలహీనంగా ఉన్నారు. విదేశాంగ విధానంలో ఘోరంగా విఫలమయ్యారు" అని ట్రంప్ చేసిన పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా దుమారం రేపింది. ముఖ్యంగా ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఈ వ్యాఖ్యలను "ఆమోదయోగ్యం కాదు" అని తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామంతో ట్రంప్, మెలోనీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం దెబ్బతిన్న సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నంలో భాగంగానే ఈ వరల్డ్ కప్ ప్రతిపాదన ముందుకు వచ్చింది. ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి పాలో జంపొల్లి మాట్లాడుతూ.. "వరల్డ్ కప్‌లో ఇరాన్ స్థానంలో ఇటలీని చేర్చాలని నేను ట్రంప్, ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినోలకు సూచించాను. నేను ఇటలీ సంతతికి చెందినవాడిని. అమెరికా ఆతిథ్యం ఇచ్చే టోర్నమెంట్‌లో అజూరీ (ఇటలీ జట్టు) ఆడటాన్ని చూడాలన్నది నా కల. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఇటలీకి ఆ అర్హత ఉంది" అని వివరించారు. విచిత్రమేమిటంటే వరుసగా మూడుసార్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో ఇటలీ విఫలమైంది. ప్లే-ఆఫ్‌లో బోస్నియా హెర్జెగోవినా చేతిలో ఓడిపోయి చరిత్రలో తొలిసారిగా ఇలాంటి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. మరోవైపు ఇరాన్ వరుసగా నాలుగోసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. అయితే, అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో తమ గ్రూప్ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు మార్చాలని మొదట ఫిఫాను కోరింది. ఆ తర్వాత దేశంపై జరుగుతున్న వైమానిక దాడుల కారణంగా టోర్నమెంట్‌లో పాల్గొనలేమని ఇరాన్ క్రీడా మంత్రి అహ్మద్ దొన్యమాలి అధికారికంగా ప్రకటించారు.

దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. "ఇరాన్ జట్టుకు ప్రపంచకప్‌లోకి స్వాగతం. కానీ, వారి ప్రాణ భద్రత దృష్ట్యా వారు ఇక్కడ ఉండటం సబబు కాదని నేను భావిస్తున్నాను" అని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. షెడ్యూల్ ప్రకారం ఇరాన్ తన తొలి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో సోఫై స్టేడియంలో ఆడాల్సి ఉంది. కానీ తాజా పరిణామాలతో అర్హత కోల్పోయిన ఇటలీకి అనూహ్యంగా తలుపులు తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.



నేహా శర్మ చిక్ మరియు సొగసైన స్టైల్ స్టేట్‌మెంట్‌లో స్టన్స్

# రౌడీ జనార్ధన కోసం భారీ యాక్షన్ సీక్వెన్స్!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ మాసీవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రౌడీ జనార్ధన-. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. కీర్తి సురేష్ తొలి సారి విజయ్‌కి జోడీగా నటిస్తుండటం, విజయ్ ఫస్ట్ టైమ్ పక్కా మాస్ క్యారెక్టర్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పలికే తూర్పు గోదావరి యాస ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ అంచనాల్ని పెంచేసింది. 80వ దశకంలో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇది. ఇందు కోసం డిఫరెంట్ మేకోవర్‌తో విజయ్ దేవరకొండ నటిస్తున్నాడు. టీజర్‌లో రౌడీ పాత్రలో విజయ్ సరికొత్తగా కనిపించిన తీరు అభిమానుల్ని, సినీ లవర్స్‌ని విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. రాయలసీమ ప్రాంతంలో జరిగిన ఓ పొలిటికల్ ఎమోషనల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు రవి కిరణ్ కోలా దీన్ని తెరకెక్కిస్తున్నాడు.విజయ్‌తో బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించాలనే పట్టుదలతో దిల్ రాజు ఈ మూవీని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మే చివర్లో రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ని ప్రారంభించి సాంగ్‌తో పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని పూర్తి చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. ఈ మూవీకి ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ అత్యంత కీలకంగా నిలుస్తుందని ఇన్ సైడ్ టాక్.ఈ ఎపిసోడ్‌లో విజయ్ దేవరకొండ ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపించి కేక పెట్టిస్తాడని తెలుస్తోంది. రౌడీలకే రౌడీగా విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమా కావడం, ఇందులో మునుపెన్నడూ లేనంతగా మాస్ క్యారెక్టర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తుండటంతో అభిమానులు, సినీ లవర్స్ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శరవేగంగా షూటింగ్‌ని పూర్తి చేసి ఇదే ఏడాది డిసెంబర్‌లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.గత కొంత కాలంగా వరుస ఫ్లాపుల్లో ఉంటూ తనదైన మార్కుని కోల్పోయిన విజయ్ దేవరకొండ ఈ మూవీతో స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని బలంగా కోరుకుంటున్నాడు. అందుకే ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ఈ సినిమా చేస్తున్నాడట. ఈ విషయాన్ని ఆ మధ్య విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌తో ఫుల్ క్లారిటీ ఇచ్చేయడంతో మళ్లీ రౌడీ రైజింగ్ అవ్వబోతున్నాడని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.



కృతి శెట్టి గ్రేస్ మరియు గ్లామర్ యొక్క విజన్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com